క్లుప్తంగా

లక్ష్మణస్వామికి మంత్రి జోగి రమేష్ నివాళి



గూడూరు: అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందిన గురిజేపల్లి సర్పంచి అద్దంకి లక్ష్మణస్వామికి మంత్రి జోగి రమేష్ నివాళులర్పించారు. ఆదివారం గురిజేపల్లిలో అద్దంకి లక్ష్మణస్వామి ప్రార్థన కూడికలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణస్వామి కుటుంబ సభ్యులను మంత్రి ఓదార్చారు. కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

రోగులకు పండ్ల పంపిణీ



మచిలీపట్నంటౌన్: నాగ్‌పూర్‌కు చెందిన మౌలానా ముఫ్తీ అబ్దుల్ హలీం సాహెబ్ రెండో ఉరుసు సందర్భంగా అబ్దుల్ హలీం ట్రస్ట్, షేర్ షా బృందం ఆధ్వర్యంలో సర్వజన ఆస్పత్రిలో రోగులకు ఆదివారం పండ్లు పంపిణీ చేశారు. ముంబైకు చెందిన ముఫ్తీ యహియా రజా సాహెబ్, బీహార్‌కు చెందిన మౌలానా షాహబుద్దీన్ సాహబ్ రజ్వీ, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా చేతుల మీదుగా ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్న 600 మంది రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ముస్లిం మతపెద్ద సికిందర్‌ఖాన్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ నిమ్మగడ్డ సత్యప్రకాష్, వైఎస్సార్ సీపీ 28వ డివిజన్ ఇన్‌చార్జి షేక్ మొహమ్మద్ సాహెబ్, అబ్దుల్ హలీం భక్తబృందం పాల్గొన్నారు.

144 మందికి వైద్యసేవలు

మచిలీపట్నంటౌన్: ప్రజారోగ్య వేదిక, జ్యోతి బాపూలే విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. బుట్టాయిపేటలోని జ్యోతి బా పూలే విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన శిబిరంలో 144 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. న్యూరాలజిస్ట్ గోపాలం శివన్నారాయణ, వైద్యులు కుప్పా రామశాస్త్రి, పి. సురేష్‌చంద్రారెడ్డి, డీఆర్‌కే ప్రసాద్, టి. పద్మావతి, రావి శ్రీనివాసరావు, ఆర్. శంకరానంద్ రోగులకు పరీక్షలు నిర్వహించారు. నిర్వాహకులు నాగయ్య, మాదాల వెంకటేశ్వరరావు, నారాయణ, బూర సుబ్రహ్మణ్యం, కొడాలి శర్మ తదితరులు పర్యవేక్షించారు.

215 మందికి నేత్ర వైద్య పరీక్షలు



కోడూరు: లెజెండ్స్ సోషల్ సర్వీసెస్ సంస్థ ఏర్పాటు చేసి 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్థానిక దానాశక్తి ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలో ఆదివారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. నాగమణి రెటీనా సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి వైద్యులు గొరిపర్తి పవన్ కుమార్ తన సిబ్బందితో కలిసి శిబిరంలో రోగులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. దివిసీమలోని వివిధ ప్రాంతాలకు చెందిన 215మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కళ్లజోళ్లు అవసరమైనవారికి సోషల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఉచితంగా అందజేస్తామని సంస్థ అధ్యక్షుడు పూతబోయిన అయ్యప్పస్వామి తెలిపారు.

శ్రీరామ నామం సర్వ పాపహరణం



కృత్తివెన్ను: శ్రీరామ నామం సర్వ పాపహరణమని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక కమిటీ అధ్యక్షుడు ఉదయ్ కుమార్ అన్నారు. సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం మండల పరిధిలోని నిడమర్రు గ్రామంలో భగవద్గీత, మన పండుగలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శ్రీరామ అనే పదానికి అర్థాన్ని వివరించారు. ప్రతి మనిషి పాపభీతి కలిగి ధర్మబద్ధుడై తన జీవనాన్ని సాగించాలన్నారు. కార్యక్రమంలో పలువురు బృంద సభ్యులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణకు కృషి

చల్లపల్లి: అంధత్వ నివారణకు కృషి చేస్తున్నామని వాసవీ క్లబ్ అధ్యక్షులు గోళ్ల ద్రోణ పూర్ణచంద్రరావు అన్నారు. చల్లపల్లిలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి కంటి పరీక్షలు చేయించి, శుక్లాలతో బాధపడుతున్న వారిని ఉచిత ఆపరేషన్లకు ఎంపిక చేశారు. గోళ్ల సాంబశివరావు, గోళ్ల ద్రోణ ఆర్థిక సాయంతో ఈ శిబిరం నిర్వహించారు. క్లబ్ ప్రతినిధులు పర్యవేక్షించారు.

పేదల ఆర్థికాభ్యున్నతే జగనన్న లక్ష్యం

- మంత్రి జోగి రమేష్
- ఆసరా లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



మల్లవోలు క్లస్టర్‌లోని లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న మంత్రి జోగి రమేష్



ఘంటసాలలో ఆసరా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

గూడూరు: నిరుపేదల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. వైఎస్సార్ ఆసరా సంబరాల్లో భాగంగా మల్లవోలు క్లస్టర్ పరిధిలోని మల్లవోలు, రామన్నపేట, ఐదుగుళ్లపల్లి, పోలవరం గ్రామాలకు చెందిన 271 స్వయం సహాయక సంఘాలకు చెందిన 2,800 మంది డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు రూ.3.69 కోట్ల వైఎస్సార్ ఆసరా చెక్కులను ఆదివారం మంత్రి లబ్ధిదారులకు అందజేశారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ దేశ చరిత్రలో ఒకేసారి 30 లక్షల మంది సొంత ఇల్లులేని నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడమే కాకుండా గృహ నిర్మాణాలకు రుణాలు మంజూరు చేసిన ఘనత జగనన్నదే అని అన్నారు. నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. తద్వారా ఆంధ్రప్రదేశ్‌ను సంపన్న రాష్ట్రంగా తీర్చిదిద్దాలని కంకణం కట్టుకున్నారన్నారు. విద్య, వైద్య రంగాలకు జగనన్న ప్రభుత్వం పెద్దపీట వేసిందని చెప్పారు. మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ మాట్లాడుతూ పదో విద్యార్థులు పరీక్షలు బాగా రాసేలా తల్లులు ప్రోత్సహించాలని కోరారు. పాఠశాల స్థాయిలో మొదటి స్థానం సాధించిన విద్యార్థికి రూ.20 వేలు, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థికి రూ.15 వేలు, తృతీయ స్థానం సాధించిన విద్యార్థికి రూ.10 వేలు బహుమతిగా ఇస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ వేముల సురేష్ రంగబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు బూరగడ్డ రమేష్‌నాయుడు, కారుమంచి కామేశ్వరరావు, గొరిపర్తి రవికుమార్, పర్ణం పెదబాబు, బొర్రా సాంబశివయ్య, పిచ్చుక గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆర్థిక భరోసా

ఘంటసాల(అవనిగడ్డ): వైఎస్సార్ ఆసరా పథకం మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహద పడుతుందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే సింహాద్రి చేతుల మీదుగా వైఎస్సార్ ఆసరా పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ ఘంటసాల మండలంలో మూడో విడత వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా 823 పొదుపు సంఘాల్లోని 7,908 మంది అక్కచెల్లెమ్మలకు రూ.6.92 కోట్లు అందించామన్నారు. ఘంటసాల మండలంలో ఇప్పటి వరకూ రూ. 20.76 కోట్లు ఈ పథకం ద్వారా అందించామని చెప్పారు. నవరత్నాల్లో భాగంగా ఆసరా, సున్నా వడ్డీ, చేయూత పథకాలు మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహద పడతాయని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆదరించాలని కోరారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు. ఇన్‌చార్జి ఏపీఎం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, ఎంపీపీ వేమూరి రజనీకుమారి, ఎంపీడీఓ కేవీ సుబ్బారావు, తహసీల్దార్ బి. శ్రీనివాసనాయక్, వైస్ ఎంపీపీలు కుంపటి నాగేంద్రబాబు, మోడెం నాగరాజు, మండల సచివాలయ కన్వీనర్ వేమూరి ప్రవీణ్, పార్టీ మండల కార్యదర్శి దిరిశం పిచ్చేశ్వరరావు, యువనేత చిట్టూరి రమేష్, ఏరియా కో–ఆర్డినేటర్ ఆంజనేయులుతో పాటు పలువురు అధికారులు, పార్టీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



మేకవానిపాలెంలో చెక్కు అందజేస్తున్న పేర్ని కిట్టు

జనరంజక పాలన జగన్‌కే సాధ్యం

కోనేరుసెంటర్: జనరంజక పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. పెదకరగ్రహారం, చినకరగ్రహారం, మేకవానిపాలెం, గోపువానిపాలెం, తపసిపూడి, మంగినపూడి, పోతిరెడ్డిపాలెం, పొట్లపాలెం, పోతేపల్లి, తాళ్లపాలెం గ్రామాల్లోని డ్వాక్రా సంఘాలకు వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత చెక్కులను ఆదివారం కిట్టు చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో పథకాలు అమలు చేస్తూ మహిళాభ్యున్నతికి సీఎం జగనన్న కృషి చేస్తున్నారని చెప్పారు. మరోసారి ఆయనను ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని డ్వాక్రా సంఘాల మహిళలు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కరగ్రహారం మాజీ సర్పంచ్ శొంఠి కల్యాణి, మేకవానిపాలెం మాజీ సర్పంచ్ మేకా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ బందరు నియోజకవర్గ కన్వీనర్లు శొంఠి ఫరీద్, వాలిశెట్టి రవిశంకర్, గాజుల నాగరాజు, కూనపురెడ్డి వీరాస్వామి, మేకా లవకుమార్, పిప్పళ్ల నాగబాబు, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ తోట సత్యనారాయణ, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం

కోడూరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధమైంది. సోమవారం నుంచి జరిగే పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. విద్యార్థులకు ఏవిధమైన అసౌకర్యం కలుగకుండా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని ఇన్‌చార్జి ఎంఈఓ శివశంకరరావు ఆదివారం తెలిపారు. కోడూరు మండలంలోని పరీక్షల నిర్వహణకు రెండు కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. స్వతంత్రపురం జెడ్పీ పాఠశాలలో ఏడు రూములు, కోడూరు రవితేజ పబ్లిక్ స్కూల్‌లో పది రూముల్లో ఏర్పాటు చేశామని వివరించారు. మండలంలోని ఐదు జెడ్పీ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలల నుంచి 363 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారన్నారు. 20 మంది ఇన్విజిలేటర్లు పరీక్షలను పర్యవేక్షిస్తారని చెప్పారు. ఎగ్జామ్ చీఫ్‌లుగా ఉపాధ్యాయులు రమణ, అనురాధ వ్యవహరిస్తారన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

హనుమంత వాహనంపై వెంకన్న నగరోత్సవం

మచిలీపట్నంటౌన్: బచ్చుపేటలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారి తిరు కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారి హనుమంత వాహనంపై నగరోత్సవం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం ప్రత్యేక పూజలు జరిగాయి. పూజా కార్యక్రమాలను ఆలయ ధర్మకర్తల మండలి వంశపారంపర్య చైర్మన్ ముత్తేవి రవికాంత్, కార్యనిర్వహణాధికారి ఎస్ఎస్ చక్రధరరావు పర్యవేక్షించారు. పూజా కార్యక్రమాలను ముత్తేవి వెంకటాచార్యులు బృందం నిర్వహించారు. రాత్రికి ఆలయ ఆవరణలో రచయిత నూలు రాధాకృష్ణ చేసిన సీతారాముల గానామృతం భక్తులను అలరించింది.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం



బందలాయిచెరువులో ర్యాలీ



బందరు బైపాస్ రోడ్డులో ప్రదర్శనగా వెళ్తున్న చిన్నారులు



మట్టలతో ప్రదర్శన నిర్వహిస్తున్న చిన్నారులు

అవనిగడ్డ: దివిసీమలోని పలు ప్రాంతాల్లో క్రైస్తవులు ప్రాణికొమ్మల ఆదివారాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అవనిగడ్డలో ఆర్‌సీఎం, సీబీసీఎన్‌సీ, ఎల్‌ఈఎఫ్, బందలాయిచెరువులోని సీబీసీఎన్‌సీ చర్చికి చెందిన విశ్వాసులు పలు రకాల పూలతో అలంకరించిన మట్టలను చేబూని పాటలు పాడుతూ ప్రదర్శన చేశారు. దావీదు కుమారుడికి జయము కలుగుగాక అంటూ నినాదాలు చేశారు. కోటగిరిలంక ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ సురేష్, బందలాయి చెరువు సీబీసీఎన్‌సీ చర్చి పాస్టర్ సునీత్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నాగాయలంకలో ఆర్‌సీఎం చర్చితో పాటు పలు చర్చిలకు చెందిన విశ్వాసులు మట్టల ఆదివారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

బందరులో..

మచిలీపట్నం టౌన్: మట్టల ఆదివారాన్ని నగరంలోని క్రైస్తవులు ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రభువైన ఏసుక్రీస్తు తనకు తాను తగ్గించుకుని గాడిదపై జేరుసలేంకు వచ్చారని, ఈ సందర్భాన్ని పురస్కరించుకుని మట్టల ఆదివారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పాస్టర్లు పేర్కొన్నారు. నగరంలోని పలు చర్చిలకు చెందిన క్రైస్తవులు ఈత ఆకులు, కొబ్బరి మట్టలను పువ్వులతో ఆలంకరించి ర్యాలీలు నిర్వహించారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. మల్కాపట్నంలోని ఎల్‌ఈఎఫ్ చర్చిలో చిన్నారులు మట్టల ఆదివారం కార్యక్రమంపై ప్రత్యేక నృత్యాలు చేశారు.

చల్లపల్లిలో..

చల్లపల్లి: క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక గంగులవారిపాలెంలోని గ్రేస్ గాస్పెల్ మినిస్ట్రీస్ ప్రార్థనా మందిరంలో, నడకుదురు శివారు నాదెళ్లవారిపాలెం చర్చిలో పాస్టర్లు జి.ఏసురాజు, గోల్కొండ డేవిడ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిన్నారులు, యువకులు ఈత మట్టలను పూలతో అలంకరించి ప్రదర్శన నిర్వహించారు.

పేకాట శిబిరంపై దాడి

తొమ్మిది మంది అరెస్ట్

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండల పరిధిలోని అచ్చెంపాలెంలో పేకాట శిబిరంపై ప్రత్యేక బృందాలు శనివారం రాత్రి మెరుపు దాడి చేసి 9 మంది జూదరులను అరెస్ట్ చేశారు. మొవ్వ ఎస్ఈబీ సీఐ పట్టాభి తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్ఈబీ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు ఆదేశాల మేరకు శనివారం రాత్రి జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ దాస్, ఇంటిలిజెన్స్ సీఐ బంగార్రాజు, మొవ్వ ఎస్ఈబీ సీఐ పట్టాభి ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలు అచ్చెంపాలెంలో పేకాట శిబిరంపై మెరుపు దాడి చేశారు. 9 మందిని అరెస్ట్ చేశారు. రూ.21,230 నగదు, 12 సెల్‌ఫోన్లు, మూడు బైకులు, 196 ప్లాస్టిక్ కాయిన్స్‌ని స్వాధీనం చేసుకున్నారు. మొవ్వ, అవనిగడ్డ, ఉయ్యూరు ఎస్ఈబీ సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుబడిన పేకాట రాయుళ్లు

కోడిపందేల శిబిరంపై దాడి: పదిమంది అరెస్ట్

కోడూరు: మండలంలోని ఉల్లిపాలెం–భవానీపురం వారధి కింది భాగంలో కృష్ణానది ఒడ్డున కోడిపందేల శిబిరంపై కోడూరు ఎస్ఐ రాజేంద్రప్రసాద్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. పది మందిని అరెస్టు చేశారు.

వారి నుంచి రెండు కోళ్లు, రూ.3,400 నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులను చూసి కొంతమంది పందెంరాయుళ్లు అక్కడ నుంచి పరారు కాగా, శిబిరం వద్ద ఉన్న 18 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు.

ప్రతిభావంతులను ప్రోత్సహించాలి

గన్నవరం: ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వంతో పాటు క్రీడా సంస్థలు ముందుకురావాలని ఎంపీపీ అనగాని రవి పిలుపునిచ్చారు. స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆదివారం ఇటీవల గోవాలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో బంగారు, రజత పతకాలు సాధించిన బాలబాలికలకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ..గన్నవరం ప్రాంతం క్రీడలకు పుట్టినిల్లు వంటిదన్నారు. ఈ ప్రాంతానికి చెందిన ఎంతో మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించారని గుర్తుచేశారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని నేటి తరం బాలబాలికలు క్రమశిక్షణ, పట్టుదలతో క్రీడల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు. జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను, శిక్షణ ఇచ్చిన వెంకట్రావును ప్రత్యేకంగా అభినందించారు. వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి చిప్పాడ చంద్రశేఖర్‌రావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్‌బాబు, ఫిజికల్ డైరెక్టర్ ధనియాల నాగరాజు వాకర్స్ ప్రముఖులు ముక్కామల సుబ్బారావు, చిల్లపల్లి శ్రీనివాసరావు, సగ్గుర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న ఎంపీపీ, వాకర్స్

నిత్యావసరాల వితరణ



పురిటిగడ్డ(చల్లపల్లి): ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిరుపేదలకు సాయం చేశారు. ఆదివారం సాయంత్రం పురిటిగడ్డలో సంస్థ ట్రస్టీ వేములపల్లి విజయ పురిటిగడ్డ, నడకుదురు పరిసర గ్రామాల నిరుపేదలు 60 కుటుంబాల వారికి నిత్యావసర సరుకులు, రూ.400 చొప్పున ఐవీఎం పింఛన్ అందజేశారు.

మోహనరావు కుటుంబానికి పరామర్శ

కోడూరు: ఉల్లిపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత, రిటైర్డ్ ఉపాధ్యాయుడు పొలాబత్తిన మోహనరావు మృతదేహానికి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆదివారం నివాళులర్పించారు. మోహనరావు శనివారం మృతిచెందారు. మోహనరావు మృతదేహానికి ఎమ్మెల్యే సింహాద్రి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ కటకం కుటుంబరావు, ఎంపీటీసీ బడే గంగాధరరావు పాల్గొన్నారు.

కథల పుస్తకాల పంపిణీ

మచిలీపట్నంటౌన్: అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం సందర్భంగా ఈడేపల్లి శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు కథల పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా గ్రంథ పాలకురాలు కోన వెంకటేశ్వరమ్మను విద్యార్థులు, లాల్ బహద్దూర్‌శాస్త్రి సత్కరించారు. తుమ్మల సత్య సూర్య వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టార్పాలిన్ పట్టాలు సిద్ధం

ఘంటసాల(అవనిగడ్డ): వాతావరణ శాఖ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో పంటలను కాపాడుకునేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ పట్టాలను అందిస్తున్నామని ఏఓ కె. మురళీకృష్ణ తెలిపారు. నూర్పిళ్లు జరిగిన ధాన్యం రాశులు తడవకుండా టార్పాలిన్ పట్టాలను కప్పుకోవాలని రైతులకు సూచించారు. ఈ దశలో పంట తడిస్తే నష్టం ఎక్కువగా ఉంటుందని, రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.

సీతారాముల ఏకాంత సేవ

మచిలీపట్నంటౌన్: సీతారామ కల్యాణోత్సవాల్లో భాగంగా స్థానిక రుస్తుంబాదలోని భద్రాద్రి శ్రీరాముల వారి ఆలయంలో ఆదివారం స్వామి వారి ఏకాంతసేవ కార్యక్రమం జరిగింది. మోగంటి నాగేశ్వరరావు, వాణి దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరించారు. తొలుత ద్వాదశ ఆరాధన, శ్రీపుష్ప యాగం చేశారు. చిన్నాపురానికి చెందిన సరస్వతి నాట్య మండలి బృందం ప్రదర్శించిన వీరబ్రహ్మం నాటకంలోని బ్రహ్మం–సిద్దుడు సీను ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమాన్ని కళాకారుడు జన్ను నారాయణరావు నిర్వహించారు. ఆలయంలో జరిగిన కార్యక్రమాలను ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అనుమకొండ శ్రీధర్, కార్యనిర్వహణాధికారి గోవాడ వెంకటకృష్ణారావు పర్యవేక్షించారు.

అట్టహాసంగా లయన్స్ క్లబ్ నామినేషన్లు



పెనమలూరు: లయన్స్ క్లబ్ 2023–2024 సంవత్సరానికి కృష్ణా జిల్లా సెకండ్ వైస్ గవర్నర్ ఎన్నికల నామినేషన్లు కానూరులో ఆదివారం అట్టహాసంగా జరిగాయి. లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ వక్కలగడ్డ భాస్కరరావు వివరాలు తెలిపారు. ప్రతి సంవత్సరం మేనెలలో డిస్ట్రిక్ట్ 2వ గవర్నర్‌కు ఎన్నికలు జరుగుతాయన్నారు. ఇందులో భాగంగా కానూరు అన్నే కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో సభ్యులు నామినేషన్లు దాఖలు చేశారన్నారు. జిల్లాలో 100 క్లబ్‌లు ఉన్నాయని, నాలుగు వేల మంది సభ్యులు ఓటర్లుగా ఉంటారన్నారు. రెండు సంవత్సరాలు వైస్‌గవర్నర్‌గా పని చేసిన తరువాత గవర్నర్ అవుతారన్నారు. కాగా గత 20 సంవత్సరాలుగా ఉన్నత సేవలు అందించిన ఆంజనేయులిని సభ్యులు గెలిపించితే సేవకు పట్టం కట్టినట్లే అని అన్నారు. తనను గెలిపించితే భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తానని ఆంజనేయులు తెలిపారు.

నేడు గూడూరులో ఆసరా చెక్కుల పంపిణీ

గూడూరు: వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు సోమవారం మల్లవోలులో నిర్వహిస్తామని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గొరిపర్తి రవికుమార్ తెలిపారు. సాయంత్రం 4 గంటలకు గూడూరు జెడ్పీ హైస్కూల్ ఆటస్థలంలో నిర్వహించే వారోత్సవాలకు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు. లబ్ధిదారులకు మూడో విడత రుణ మాఫీ చెక్కులను అందజేస్తారని చెప్పారు. గూడూరు క్లస్టర్ పరిధిలోని డ్వాక్రా అక్కచెల్లెమ్ములు తరలిరావాలని ఆయన కోరారు.

రేపు మోపిదేవిలో ఆసరా పంపిణీ

మోపిదేవి: మూడో విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం బుధవారం ఉదయం 10 గంటలకు మోపిదేవిలో జరుగుతుందని డీఆర్‌డీఏ ఏపీఎం శ్రీనివాస్ తెలిపారు. డ్వాక్రా మహిళలకు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చెక్కులు పంపిణీ చేస్తారని చెప్పారు. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రైతు కుటుంబానికి సాయం



చల్లపల్లి: గ్రామానికి చెందిన రైతు, చల్లపల్లి పీఏసీఎస్ సభ్యుడు బొందలపాటి సాయి సుబ్బారావు మృతి చెందాడు. కేడీసీసీ బ్యాంక్ సాయం, సంఘ సభ్యుల సంక్షేమ నిధి సాయం కలిపి రూ.20 వేలను రైతు కుటుంబానికి పీఏసీఎస్ చైర్మన్ పాగోలు నాగ సీతారామరావు (ఫణి) అందజేశారు. కార్యక్రమంలో సీఈఓ తోట కృష్ణారావు, పర్సన్లు వేముల ఏడుకొండలు, కొలుసు సుబ్బారావు పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

గూడూరు: గూడూరులో ప్రసిద్ధి చెందిన శ్రీదేవి భూదేవి సమేత వెంకటాచల స్వామి దివ్య బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం అవుతాయని ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ తిమ్మరాజు కృష్ణకాంత్, కార్యనిర్వహణాధికారి తిక్కిశెట్టి వీర వెంకట మోహనరావు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజైన సోమవారం ఉదయం స్వామి వారిని పెండ్లి కుమారుని చేస్తారు. రెండో రోజు మంగళవారం సాయంత్రం జగజ్యోతి, ఎదుర్కోలు సన్నాహాలు నిర్వహించి స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. మూడో రోజు బుధవారం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన, రాత్రి స్వామి వారి రథోత్సవం జరుగుతుంది. నాలుగో రోజైన గురువారం పూజా కార్యక్రమాలు, చివరి రోజైన శుక్రవారం స్వామి వారికి పుష్పయాగోత్సవం, పవళింపు సేవ నిర్వహిస్తామని వివరించారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

అవనిగడ్డ: నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని ఎస్సీ వసతి గృహాల్లో పదో తరగతి చదువుతున్న 70 మంది విద్యార్థులకు శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, స్కేల్స్, పెన్సిళ్లను శనివారం పంపిణీ చేశారు. సొసైటీ కన్వీనర్ తోట శ్యాంకిశోర్‌నాయుడు ఆయా వసతి గృహాలకు వెళ్లి వాటిని విద్యార్థులకు అందజేశారు. వసతి గృహ అధికారి కె. సాల్మన్, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నసమారాధనలు



అవనిగడ్డ: శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని పలు రామాలయాల వద్ద ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. అవనిగడ్డలోని పలు రామాలయాలు, మోదుమూడి, అశ్వరావుపాలెం, బందలాయిచెరువు, గుడివాకవారిపాలెం, పులిగడ్డ, వేకనూరులోని రామాలయాల్లో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా స్వామి వారి చిత్రపటాన్ని ఊరేగిస్తూ భజనలు చేశారు.